## నేడు అన్నదానం

**జగద్గిరిగుట్ట:** బోనాలు పండుగ సందర్భంగా మగ్దూంనగర్‌లోని ఎల్లమ్మ పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు సమర్పించిన ఒడి బియ్యంతో మంగళవారం అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. మగ్దూంనగర్‌లోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి, అక్కడే అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపింది.

## నేటి చలో అసెంబ్లీకి తరలిరావాలి

**జగద్గిరిగుట్ట:** కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ యూనియన్ నాయకులు హరినాథ్, రాములు సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. జీహెచ్‌ఎంసీలో పనిచేసే అన్ని రంగాల కార్మికులు ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు చేరుకోవాలని, అక్కడి నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా వెళ్లనున్నట్లు తెలిపారు.

## దోమల బెడద నుంచి కాపాడరూ..!

**జీడిమెట్ల:** ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్, దోమల నివారణ మందును సరిగా పిచికారీ చేయడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎంటమాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీనికోసం యేటా లక్షల్లో డబ్బు ఖర్చు చేస్తుంది. అయినప్పటికీ దోమల బెడద మాత్రం తగ్గడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంటమాలజీ సిబ్బంది స్పందించి ఫాగింగ్, స్ప్రే సరిగా చేయాలని వారు కోరుతున్నారు.

## మాజీ మంత్రి ముఖేష్ గౌడ్‌కు నివాళి

**కుత్బుల్లాపూర్:** నగరంలోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముఖేష్‌గౌడ్ వర్ధంతి కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీలో మాస్ లీడర్‌గా ఎదిగిన ప్రజానాయకుడు ముఖేష్‌గౌడ్ అని కొనియాడారు.

# పర్మిషన్ వస్తే ప్రారంభమే..!



ఈసీఐఎల్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనం

### ఈసీఐఎల్‌లో కుత్బుల్లాపూర్ మెడికల్ కాలేజీ

- తాత్కాలిక భవనంలో 50 సీట్లతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- ఎన్‌ఎంసీ అనుమతిస్తే 2024-25 ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు
- కుత్బుల్లాపూర్‌లో శాశ్వత భవనం నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కేటాయింపు
- ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకుల నియామకాలు పూర్తి
- ప్రాథమిక సదుపాయాల కల్పనపై అధికార యంత్రాంగం దృష్టి
- కళాశాలకు అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియాస్పత్రి
- 70 నుంచి 220 కి పెంచిన పడకల సంఖ్య

**సాక్షి, సిటీబ్యూరో:** కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఎన్‌ఎంసీ అనుమతిస్తే ఈ విద్యా సంవత్సరం 2024-25 నుంచే 50 సీట్లతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొత్త వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ డాక్టర్ మురళీకృష్ణను నియమించారు. దీంతోపాటు తరగతుల నిర్వహణకు అనువైన భవనాన్ని గుర్తించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనాన్ని ఎంపిక చేసి అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నది. ప్రిన్సిపాల్‌తో సహా పలు విభాగాల అధ్యాపకుల నియామకాల ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఫర్నిచర్, ల్యాబ్‌లతో పాటు మెడికల్ కాలేజీకి కావాల్సిన పరికరాలను సమకూర్చుతోంది. ప్రైవేట్ భవనంలో నిర్వహించనున్న మెడికల్ కాలేజీని ఇప్పటికే సందర్శించిన జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ), మరోదఫా కూడా పరిశీలిస్తుందని, వారి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఎంబీబీఎస్‌లో మొదటి ఏడాదిలో 50 సీట్లతో తరగతులు ప్రారంభిస్తామని అధికార వర్గాలు పేర్కొంటోంది. క్రమంగా సీట్ల సంఖ్యను పెంచనున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ రాక, అడ్మిషన్ల ప్రక్రియ మొదలుతో మల్కాజిగిరి జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

### 20 ఎకరాల స్థలం

సామాన్యులకు కూడా వైద్య విద్యను అందించాలనే ఉద్దేశంలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ చొప్పున మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొత్త మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ నేపథ్యంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్థానికంగా 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది.అయితే అక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో తరగతులు నిర్వహించనున్నారు.

### అనుబంధంగా మల్కాజిగిరి ఏరియా ఆస్పత్రి

ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎంపిక చేసిన జిల్లా అధికార యంత్రాంగం పడకల సంఖ్య పెంపునకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం 70 పడకలు ఉండగా, ఆ సంఖ్యను 220 పడకలకు పెంచినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. అలాగే పడకల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు, పరికరాలు, వైద్యులు, సిబ్బంది సంఖ్యను కూడా పెంచారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణ కోసం రిక్రూట్ చేసిన ప్రిన్సిపాల్‌తో సహా అధ్యాపకులు ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

## సంక్షేమ పథకాలకు ఆకర్శితులై చేరిక


హన్మంతరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన మహేశ్‌ముదిరాజ్ తదితరులు

**నిజాంపేట్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని కార్యాలయంలో 19వ డివిజన్ బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ నందిగామ మహేశ్‌ముదిరాజ్ తన మిత్ర బృందంతో కలిసి సోమవారం పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేస్తోందని, ముఖ్యంగా యువత అభ్యున్నతికి ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. చేరినవారిలో రాము, కల్యాణ్, రాకేశ్, మహేశ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రోడ్డు విస్తరణ చేపట్టరూ..!


సాయిబాబానగర్ ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న స్థానికులు

**సుభాష్‌నగర్:** సాయిబాబానగర్ ప్రధానరోడ్డులోని గిరి హాస్పిటల్ వద్ద చౌరస్తా ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జాం అవుతోంది. సూరారం ప్రధాన రోడ్డు నుంచి సాయిబాబానగర్ మీదుగా తెలుగుతల్లినగర్ వరకు 2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ముందుకు వెళ్లేందుకు సరైనా మార్గం లేక గంటలు తరబడి ట్రాఫిక్ జాం అవుతోంది. గతంలో ఈ రోడ్డు విస్తరణ పనుల విషయం తెరపైకి వచ్చినా ఇంతవరకు ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ కూన జగన్‌గౌడ్

**కుత్బుల్లాపూర్:** ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. వివేకానందనగర్ కాలనీలోని పోచమ్మ ఎల్లమ్మ ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ కూన జగన్‌గౌడ్ ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో సత్యం, నరసింహ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి

**కుత్బుల్లాపూర్:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి హెచ్చరించారు. ఆల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సుచిత్ర చౌరస్తాలోని జాతీయ రహదారి-44కు ఇరువైపులా సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్‌రూట్ డ్రైవింగ్, లైసెన్స్ లేని 22 మంది ద్విచక్రవాహనదారులు పట్టుబడగా వారికి ఏసీపీ వెంకటరెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటిసారి పట్టుబడిన వారికి చలాన్ విధించి వదిలిపెడుతున్నామని, మరోసారి పట్టుబడితే లైసెన్స్‌ల రద్దు చేస్తామని పేర్కొన్నారు. పట్టుబడిన వాహనదారులపై కేసులు నమోదుచేసి వాహనాలను స్టేషన్‌కు తరలించారు. డ్రైవ్‌లో ఆల్వాల్ ట్రాఫిక్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ


వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న కేల వెంకట్రావు

**మోతీనగర్:** దివ్యాంగులను మనలో ఒకరిగా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ శాఖ అధ్యక్షుడు కేల వెంకట్రావు అన్నారు. సోమవారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్‌లో దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల క్రితం సామాన్య కార్యకర్తగా లయన్స్ క్లబ్‌లో సభ్యత్వం పొంది వివిధ హోదాల్లో పనిచేస్తూ తనకు చేతనైన సహాయాన్ని చేస్తున్నట్లు తెలిపాడు. గతంలో బాలానగర్‌లో తాత్కాలిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ, నిరుపేదలకు తాత్కాలిక నివాసం సైతం నిర్మించినట్లు తెలిపాడు. కార్యక్రమంలో నారయణమ్మ, వెంకటేశ్వర్లు, బొడ్డు బుచ్చయ్య, చిరంజీవి, గొర్ల సత్యనారాయణ, వెంకటేష్, మురళి, శ్రీను, రాంబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న బండి రమేశ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

**కూకట్‌పల్లి:** కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొత్తగొల్ల రమేష్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ చికిత్స నిమిత్తం రాందేవ్ రావ్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అతడి కుటుంబ సభ్యులు సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించాడు. ఇందుకు సంబంధించి అతడికి రూ. 30 వేలు మంజూరయ్యాయి. సోమవారం జీవీఆర్ కార్యాలయంలో బండి రమేష్‌తో కలిసి ఆయన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, మేకల రమేష్, ఫణి కుమార్, వాసులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న అన్నెం కోటిరెడ్డి, వంశీధర బాబు తదితరులు

**మోతీనగర్:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, అందుకోసం ప్రతి ఒక్కరూ గుడ్డతో తయారు చేసిన సంచులను వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ పర్యావరణ పరిరక్షణ కమిటీ 320డి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి అన్నారు. సోమవారం లయన్స్ జిల్లా టి 20 కేబినెట్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వంశీధర బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లను నిషేధించినా అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా వాటి వినియోగం కొనసాగుతుందన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన 320డి జిల్లా కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి పదవీ ప్రమాణం చేసిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్ సూరిరాజ్, విజయలక్ష్మి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం..!

**సుభాష్‌నగర్:** జీడిమెట్ల బస్ డిపో వద్ద ప్రధాన రహదారి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియన వాహనం ఢీకొట్టడంతో ఓ వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దానిని తొలగించి కొత్త స్తంభం అమర్చాలని వారు కోరుతున్నారు.


జీడిమెట్ల బస్ డిపో వద్ద ప్రధాన రహదారి పక్కన ఒరిగిన స్తంభం

## క్వారీ గుంతలో పడి బాలుడి మృతి


గుంత నుంచి ఆర్మాన్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట:** క్వారీ గుంతలో పడి బాలుడు మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కైసర్‌నగర్‌కు చెందిన సల్మాన్‌కి ఇద్దరు కుమారులు. వారు స్థానిక పాఠశాలలో చదువుతున్నారు. కాగా కుమారుడు ఆర్మాన్ (9) మరో ముగ్గురు బాలురుతో కలసి సోమవారం సాయంత్రం బాలయ్యనగర్ క్వారీ గుంతలో ఈతకు వెళ్లాడు. ఆర్మాన్ ప్రమాదవశాత్తు గుంతలో జారి పడ్డాడు. అయితే ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. దీంఓ మిగితా బాలురు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న జగద్గిరిగుట్ట పోలీసులు ఆర్మాన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నేడు 'డయల్ యువర్ డీఎం'

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి డిపో పరిధిలోని ప్రయాణీకుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీయం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 9959226151 నంబర్ ద్వారా కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరిని సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్ 2, హెచ్‌సీయూ, మేడ్చల్ ప్రాంత ప్రయాణికుల సమస్యలను డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం ద్వారా కూకట్‌పల్లి డివిజన్ అధికారి డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్స్ ఆర్. కవిత పరిష్కరించనున్నారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు 9959226148 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం..!


షాపూర్‌నగర్- చింతల్ రోడ్డులోని నాలా కల్వర్ట్ వద్ద పేరుకుపోయిన చెత్త

**రంగారెడ్డినగర్:** గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో వందలాది ఎకరాల హెచ్‌ఎంటీ ఖాళీ స్థలం ఉంది. అయితే వర్షం పడినప్పుడు వరద సాఫీగా వెళ్లేందుకు జగద్గిరిగుట్ట-షాపూర్‌నగర్ పైపులైన్ రోడ్డు, షాపూర్‌నగర్-చింతల్ హెచ్‌ఎంటీ రోడ్లలో నాలా కల్వర్టులు నిర్మించారు. అయితే వీటి నిర్వహణను అధికారులు విస్మరించడంతో ప్రస్తుతం చెత్తాచెదారాలతో నిండిపోయాయి. ఈ కల్వర్టు నాలాను వేంకటేశ్వర నగర్ సమీపంలో ప్రధాన నాలాకు అనుసంధానం చేశారు. అయితే ఇందులో చెత్త పేరుకుపోవడంతో వరద వెళ్లే మార్గం మూసుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాలా కల్వర్టుల వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి వరద సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

# అధ్వానంగా ప్రధాన రోడ్డు..!


అంజయ్యనగర్‌లోని ప్రధాన రోడ్డు దుస్థితి

**జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట అంజయ్యనగర్‌లోని ప్రధాన రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ కాలనీలో వివిధ లింక్ రోడ్లు, ప్రధాన రహదారిలో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. కానీ వీటికి అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్డులో మాత్రం పనులు ఇంకా ప్రారంభం కాలేదు. డ్రైనేజీ పనులు పూర్తై 3 నెలలు కావస్తున్నా ఇంకా రోడ్డు పనులు మొదలు కాకపోవడంతో ప్రజలు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గాజులరామారం ఏఈ తిరుపతిని 'సాక్షి' వివరణ కోరగా ఈ రోడ్డులో ముందు ప్యాచ్ వర్క్ చేద్దామని అనుకుంటే స్థానికుల అభ్యంతరం తెలిపారని పేర్కొన్నారు. దీంతో రూ. 84 లక్షలతో పూర్తి రోడ్డు నిర్మాణం చేపడుతామని ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

# కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మస్తాన్ రెడ్డి

**మోతీనగర్:** శ్రీ వివేకానందనగర్ కాలనీ వాసులకు సేవ చేయాలనే లక్ష్యంతోనే అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచానని అధ్యక్ష అభ్యర్థి దేవరింటి మస్తాన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం కమిటీ హాల్‌లో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వార్డు కార్యాలయం కొనసాగుతున్నందున కాలనీ వాసులు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకోవాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. కమిటీ హాల్‌ను అందుబాటులోకి తీసుకువస్తానని తెలిపారు. కాలనీలోని ఆలయాల్లో పూజారులకు సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆలయ పూజారులకు నివాసం కల్పించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులకు సరిపడా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. విద్యుత్, వీధి లైట్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వి టీం ఏర్పాటు చేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఆగస్టు 4న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు.

# పార్కు నిర్వహణపై పట్టింపేది..?


రాధాకృష్ణన్ పార్కులో నిలిచిన వర్షపు నీరు

**నిజాంపేట్:** ప్రగతినగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కు నిర్వహణ సరిగా లేక అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద చేరి చెరువును తలపిస్తున్నది. దీంతో వాకర్స్, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. యేటా ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పార్కులో వరద నిలవకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రెయిన్‌ను నిర్మించాలని వారు కోరుతున్నారు.

## ఫలహారబండి, తొట్టెల ఊరేగింపు


ఫలహారబండి ఊరేగింపులో పాల్గొన్న ఎస్‌ఐ రమేశ్

**నిజాంపేట్:** బాచుపల్లి సాయినగర్‌లో అమ్మవారి ఫలహారబండి, తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్‌ఐ రమేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పుర వీధుల గుండా ఫలహారబండిని ఊరేగించి అనంతరం గ్రామదేవతకు నివేదన చేశారు. అదే విధంగా భక్తులు తొట్టెలను ఆలయ ప్రాంగణంలో సమర్పించారు.

## బాచుపల్లిలో పీరీల ఊరేగింపు


పాల్గొన్న కార్పొరేటర్ సుధాకర్, సత్యనారాయణ, జహంగీర్

**నిజాంపేట్:** బాచుపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ముస్లింలు పీరీల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలను వీధులగుండా ఊరేగించగా ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్, కొలన్ కృష్ణారెడ్డి, నందిగామ సత్యనారాయణ, చిన్న భూపాల్, దూస కంటి వెంకటేశ్, మైనార్టీ నాయకుడు జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా గొయ్యి..!


సుభాష్‌నగర్ నుంచి జీడిమెట్ల వెళ్లే దారిలో గొయ్యి

**చింతల్:** సుభాష్‌నగర్ జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో ఎక్సలెన్సియా సమీపంలో రోడ్డు పక్కనున్న గొయ్యి ప్రమాదాలకు నిలయంగా మారింది. గతంలో నాలా కోసం తవ్వి అలాగే వదిలేశారు. దీంతో ఇప్పటికే అనేకమంది వాహనదారులు ఇది గమనించక అందులో పడి గాయపడ్డట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి అక్కడ కల్వర్టు నిర్మించాలని, అప్పటివరకు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.